అమృత్‌కిరణ్ కథలపోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ (250/-)

# మొన్నా, నిన్నా, నేడూ

కన్నేపల్లి చలమయ్య శాస్త్రి

క్రీ.శ. 1964...

భాస్కరమూర్తి ఆ జంక్షన్లో అర్ధగంటకు పైగానే నిల్చున్నా ఒక్కటౌన్ బస్ కూడా రాలేదు.

రాత్రి ఎనిమిదిన్నర.

సన్నగా చలి.

దానికి తగ్గట్టు ఆకాశం మబ్బులు కమ్ముకుంది. తీరప్రాంతాల్లో రానున్న తుపానుకి సూచనప్రాయంగా.

మఫ్లర్‌బిగించి సిగరెట్ వెలిగించాడు... ఊపిరితిత్తుల్లోకి పొగ చేరడంతో ఎక్కడలేని ఉత్సాహమూ పొడుచుకొచ్చింది.

ఝూమ్మంటూ ఆలోచనలు ముసిరాయి.

మరో అరగంట తర్వాత కామ్రేడ్ రాంబాబు ఇంట్లో జరగనున్న సమావేశం గుర్తొచ్చింది. సమావేశంలో తాను మాట్లాడబోయే ఉపన్యాసాన్ని మననం చేసుకుంటున్నాడు.

బడుగు ప్రజల్లో ఆవేశముంది, ఉక్రోషముంది. ప్రతీకార వాంఛ నివురు గప్పిన నిప్పులా దాగి ఉంది.

ప్రభంజనం వీచినప్పుడే నిప్పు రాజుకుంటుంది. సారథ్యం లేక దిశాహీనులై ఇన్నేళ్ళ చరిత్రలోనూ బలిపశువులైన పీడితవర్గం ఈ దెబ్బతో కళ్ళు తెరుస్తుంది.

వారి దుఃఖాన్ని దూరం చేయడానికే అన్నట్టు తనలాంటి వాళ్ళను సృష్టించిందీ వ్యవస్థ. దరిద్రుల సమస్యల పట్ల అవగాహన, వారి కష్టాల పట్ల సానుభూతి, వారిని చైతన్యవంతులుగా మార్చాలన్న తపన... ఇలాంటి ఏకాభిప్రాయాలున్న తనలాటి వాళ్ళందరినీ కలుపుతున్నది ఆ సమావేశం.

ఈ సమావేశం చరిత్రపుటల్ని మార్చి పారేస్తుంది.

ఎదురుగా ఒకరిక్షా ఆగింది.

రొప్పుతూ, రోజుతూ ఊపిరి భారంగా తీస్తున్న బక్కచిక్కిన రిక్షావాడు రిక్షాదిగిన భారీ మనిషితో అంటున్నాడు.

"ఇదేటి బాబయ్యా, ఆసుపత్రి నుండి రెండు కోనులు ఎగుడులో లాక్కొచ్చినాను. ఇంత దూరానికి రెంట్రూపాయలిత్తావయ్యా..."

"ఒరేయ్ నేనేం ఈ ఊరికి కొత్తోణ్ణిగాదు. మామూలుగానయితే రూపాయిన్నరే అవుద్ది. ఏదో ముసులోడివి, రేత్రిపూట కాబట్టి మరో అర్ధపాయి ఎక్కువిచ్చాను."

చెప్పాల్సింది మరి లేనట్టు తన భారీకాయాన్ని దొర్లించుకుంటూ ఎదురుగానున్నమూడు నక్షత్రాల హోటల్లోకి దారితీశాడు.


దూది కూరిన బస్తాలా నిండుగా, మేకల్ని భుజించిన పులిలా భయంకరంగా అతను నడుస్తూంటే కసిగా చూస్తున్నాడు భాస్కరమూర్తి.

ఈ కలిమి వెనుక ఎందరి కష్టం ఇంకిందో, ఎందరి కన్నీరు ఏరులై ప్రవహించిందో...

రిక్షావాడు తన దురదృష్టాన్ని తిట్టుకుంటూ వచ్చినవైపే రిక్షాతిప్పాడు. "హాస్పిటల్ వైపే వెళ్తున్నావా?" ప్రశ్నించాడు భాస్కరమూర్తి.

అనుమానంతో చూస్తున్నాడు. రిక్షావాడు.

"నాకు తెల్సు, అట్నుండి అంతా ఎగుడూ, ఇటునుండి దిగుడూ అయినా, ఆ రాక్షసుడిలా నిన్ను దోచుకోను. మూడు రూపాయిలిస్తాను. ఎక్కమంటావా?"




కె.బి.భార్గవాచారి, హరివరం పోస్ట్, కోవెలకుంట్ల తాలూక, కర్నూలు జిల్లా.



రిక్షావాడి మొహం వికసించింది.

భాస్కరమూర్తి ఎక్కికూర్చున్నాక రిక్షా కదిలింది.

రక్తం కాలువలు కట్టిన రహదారి మీద జారుతూన్న జగన్నాథరథం రిక్షా సర్రుసర్రున ముందుకు జరుగుతూ దూరాన్ని మింగేస్తుంది.

రిక్షావాడితో మాటలు కలిపాడు మూర్తి. మాటల్లో మూర్తికి తెలిసింది.

రిక్షా అతని స్వంతం కాదని, రిక్షా వాడిపేరు నర్సిగాడనీ, రోజుకి ఆర్రూపాయిల అద్దె అనీ.

రాత్రి పదింటికల్లా అద్దె చెల్లించకపోతే మర్నాడు రిక్షా ఓనరు రిక్షా అద్దెకి ఇవ్వడనీ, అంటే... ఇంటిల్లిపాదీ ఆరోజు పస్తుండాల్సిందేననీ, రిక్షావాడు ఇంకా చెప్తూనే ఉన్నాడు. ఓనరు కర్కోటకుడు. ఒక్కోరోజు అద్దె చెల్లించడానికే డబ్బులు గిట్టవు అప్పుడు ఓనరమ్మ పెట్టే శాపనార్థాలు వింటే ఈ సరజన్మనెందుకిచ్చావురా దేవుడా" అని జీవితం మీద రోత కలుగుతుంది.

తెగించి, ఏ సముద్రంలోనో దూకేసి జన్మ విముక్తి చేసుకుందామంటే... తన కష్టంమీద బ్రతుకుతూ, తను తేబోయే వెచ్చాలకోసం ఎదురు చూసే నాలుగు ప్రాణులు కాళ్ళకుబంధం వేస్తున్నాయి.

ఈ టౌనుబస్సులొచ్చి తనలాటి వాళ్ళ కడుపులు కొట్టాయి. దీనికి తోడు పావలా, అర్ధా గుంజుకుపోయే పోలీసుల జులుం.

మూర్తి గుండె ద్రవించింది అతని కథను వింటూంటే.

"నీ చేతగానితనాన్ని నిందించుకుంటూ కూచుంటే నువ్వేం బాగుపడ్తావ్? నీ ఆవేశాన్ని దారి మళ్ళించు. ఈ కసి నీ బ్రతుకుపట్లకాక నిన్నిలాదోచుకుంటున్నా నీ ఓనర్‌లాటి వాళ్ళమీద చూపించు నువ్వూ, నీలాటి రిక్షా సోదరులు - రిక్షాలు లాగమని మొండికేస్తారనుకో, అప్పుడేమవుతుంది? ఏమవుతుందో ఊహించు.'

రిక్షా నర్సిగాడు భాస్కరమూర్తి మాటలు మంత్రముగ్ధుడై వింటున్నాడు.

"ఓనరుకి డబ్బుబలముంది. శ్రమశక్తి లేదు. రిక్షాలను పూజిస్తూ కూర్చుంటే వాడి ఇనప్పెట్టె నిండదుకదా!

నీలాటివాళ్ళు ఆ రిక్షా చక్రాలు తిప్పితేనే లాభం వాడి భోషాణం చేరుతోంది. అద్దె తగ్గించకపోతే రిక్షా తిప్పనను... వాడే దారికి వస్తాడు." నర్సిగాడు ఇంతకు మునుపు తన జీవితంలో తారసిల్లిన దుఃఖాన్నీ దరిద్రాన్నీ భాస్కరమూర్తి పాదాలమీద కుప్పలాపోశాడు.

వాడు తండ్రి సన్నకారు రైతట. రెండు జతల ఎడ్లు, ధాన్యం కొట్టాం, మామిడితోట, రెండున్నర ఎకరాల వల్లపు సేద్యం ఉండేదట. తాము అయిదుగురు అన్నదమ్ములు, ఇద్దరు అప్పచెల్లెల్లట.

ఇన్ని పొట్టల్నీ పోషించడాన్ని చెక్కాముక్కా కరిగిపోయి అతని సన్నకారురైతు తండ్రి రైతుకూలీగా మారిపోయాడట. తామంతా తలో కామందువద్దా కంబా రానికి చేరారట.

పండుగలు... పబ్బాలు, పురుళ్ళు, పుణ్యాలు తమబ్రతుకుల్ని మేకలు మేసేసిని గడ్డి మొక్కల్లా మార్చేశాయట.

కామందుల దగ్గర అడపాదడపా తీసుకున్న బయానా వడ్డీ వేసిన వెయ్యితలల్తో రాకాసి పామై కాటేసిందట.

కూలీ పెంచమంటే, పస్తుల్తో మాడ్చి చంపేరట కామందులు.

ఆ బాధ, బ్రతుకుభయం భరించలేక తాను పిల్లల్తో విశాఖపట్నం పారిపోయివచ్చాడట. రిక్షాలాగుతూ బ్రతుకు దొర్లిస్తున్నాడట.

"ఏ ఊరయ్యానీది" అడిగాడు భాస్కరమూర్తి.

నిట్టూర్చి చెప్పాడు నర్సిగాడు. "ఏ ఊరని ఎందుకడుగుతావులే బాబూ!" మానింది మందు, బ్రతికింది ఊరు... ఇప్పుడీ ఇసాపట్నమే నా ఊరు. అయినా మంచి మనసున్న మడిసివి, అడిగావు కాబట్టి చెబుతున్నా... హీరమండలం కాడనున్న జిల్లేడుపేట మాది..."

భాస్కరమూర్తి ఉలిక్కిపడ్డాడు.

అతనిదీ అదే ఊరు, అతని తండ్రీ అక్కడో భూకామందు. చదువుకోసమని కొన్నాళ్ళు విజయనగరంలోనూ, కొన్నాళ్ళు విశాఖపట్నంలోనూ ఉండడంచేత అతనికి తన ఊరివాళ్ళతో అట్టే పరిచయం లేదు.

ఎందరో దరిద్రనారాయణులలో... వీడొకడన్న మాట.

కింగ్‌జార్జి హాస్పిటల్ దరిదాపుల్లో రిక్షాదిగి, వాడికి మూడురూపాయిలిచ్చాడు భాస్కరమూర్తి.

"ఒద్దుబాబూ... తమలాటి మంచోళ్ళకాడ ఎక్కువ తీసుకోడం నాయంగాదు. రెండ్రూపాయిలు చాలు" అంటూ రూపాయి ఇచ్చేసి నమస్కారం పెట్టాడు నర్సిగాడు.

"ఉంచుకోవోయ్, నేనే ఇస్తున్నాను గానీ నువ్వేం డిమాండ్ చెయ్యలేదుకదా?"

"బతుక్కుపయోగపడే సానా మంచిమాటలు సెప్పావుబాబూ, నీలాటోళ్ళుపదికాలాల పాటు సల్లగా బతకాల... కొండెక్కుతున్న నా ధైర్యానికి నీ మాటలు సంజీవని మంత్రం ఏసాయి. కాల్చుకుతింటున్న దిగుల్ని ఉఫ్‌మని ఊదిపారేసావు. మా ఓనర్ నా కొడుక్కి బుద్ధి సెప్పాల, సెవుతా...' నంటూ రిక్షా ఎక్కి సందుమలుపు తిరిగాడు దెయ్యం పట్టినవాడిలా.

రాత్రి తొమ్మిందింటికి ప్రారంభమయిన సమావేశం తెల్లారినంత వరకూ కొనసాగింది. ప్రాంతీయ పార్టీ అవతరించింది. జిల్లాస్థాయి కార్యనిర్వాహక వర్గం ఎన్నికయింది.

భళ్ళున తెల్లారింది. తలదిమ్ముగా ఉండడంతో తనరూమ్‌కి కాక తాటిచెట్లపాలెంలో నున్న అక్కగారింటికి తోవ తీశాడు భాస్కరమూర్తి.

"ఊరిలో ఉన్నావన్నమాటేగానీ బొత్తిగా నల్లపూసయి పోయావేమిట్రా తమ్ముడూ..." అంటూ బోల్డంత అప్యాయతను కురిపించింది అక్కగారు.

స్నానం, సంధ్య ముగించి అక్క పెట్టిన వేడివేడి ఉప్మాలో జీడి పప్పు ఎంచుకుని తింటున్నాడు మూర్తి.

"నాన్న ఉత్తరం రాశార్రా మూర్తీ... నీ గురించి ఎంత బెంగపెట్టుకుంటున్నారో, తెల్సా" నువ్వేదో ఉద్ధరిస్తావని ఇక్కడ చదివిస్తూంటే ఏదో తలతిక్క పార్టీని పట్టుకుని వేలాడుతున్నావట... ఇంత పెద్ద వ్యవసాయమూ తానొక్కడే చూడలేక పోతున్నానని, నిన్ను ఇంటికి పంపించమని రాశార్రా" అంది.

"ఎందుకే? ఎండలో, వానలో పొలం గట్ల మీద నిలబడి పాలేర్లసజమాయిషీ చేయడానికా? జలగల్లా వాళ్ళరక్తాన్ని త్రాగేస్తూ, తెగ బలిసిపోయామే అక్కయ్యా. ఆ పని చేయడానికి నాకు ఇష్టమూ లేదు, ఓపికా




సంతోషం

బావ: నీ సంతోషం కోసం కొండమీది కోతినైనా తెస్తా రాణీ!

మరదలు: వేరే ఎందుకు? నువ్వున్నావు కదా బావా?

-ఎన్.చంద్రకాంత్,వన్పెల్.




కె.బి.భార్గవాచారి, హరివరం పోస్ట్, కోవెలకుంట్ల తాలూక, కర్నూలు జిల్లా.

## ఉందిగా

"ఎంతో ఇంత చిన్న గదికి నాలుగువందల అద్దెన్నా? ఎలా ఉంటున్నావురా?" ప్రశ్నించాడు సురేష్.

"ఇలాంటి రూమ్ మళ్ళీ దొరకదు కాబట్టి" చెప్పాడు రమేష్.

"ఏం బాగుందిరా?" అడిగాడు సురేష్.

"మాఎదురింట్లో మనీషా కోయిరాల లాంటి అమ్మాయి, పక్కింట్లో కరిష్మాకపూర్ లాంటి అమ్మాయి, వెనకింట్లో మమతాకులకర్ణి లాంటి అమ్మాయి, పక్కవాటాలో రవీనాటాండన్ లాంటి అమ్మాయి ఉంది. ఇంత కన్నా మంచి రూమెక్కడ దొరుకుతుంది చెప్పరా" తాపీగా చెప్పాడు రమేష్.

బి.భరత్‌కుమార్,
ఇ.నం.11-1-5/14,
చంద్రశేఖరకాలనీ,
నిజామాబాద్.

లేదు."

"ఇదంతా నాన్న ఎవరికోసం చేస్తున్నాడ్రా, నీ కోసం కాదూ?"

"నీ ఇంటికి రావొద్దంటే మానేస్తాగానీ, ఈనీతిబోధలు చెయ్యకే అక్కయ్యా" నాన్నదారి వేరు, నా దారి వేరు. జీవితంలో ఎంతో సాధించాలి. ఎందర్నో ఉద్ధరించాలి. మా పార్టీ నిన్ననే ఫార్మయింది. మన జిల్లాకి నేనే వైస్ ప్రెసిడెంటుని. వచ్చేవారం హైదరబాబాద్‌లో రాష్ట్రస్థాయి ఎన్నికలు జరుగుతాయి. రోజులు తిరిగాయంటే మా పార్టీ అధికారంలోకి వచ్చి, పేదోళ్ళ బ్రతుకులో పండుగ తీసుకొస్తుందే..."

"ఏమిటోరా, నీ మాటలు నాకర్థంగావు. కొన గల గేదెకు మెయ్యగల బచ్చలి వెతుక్కుంటున్నావు. ఉన్నదానిని వదులుకుని, లేనిదానికోసం కలలు గనడం నాకు నచ్చడం లేదురా?"

ఇంకా ఏదో చెప్పబోయింది అక్కగారు. ఇంతలో బయట కలకలం. బావగొంతు వినిపిస్తోంది బిగ్గరగా.

కిటికీలోంచి చూస్తోంది అక్కగారు.

"ఏమిటే అక్కా, ఏమిటీ గొడవ."

కాఫీ చప్పరిస్తూ చెప్పింది. రాత్రి ఎవడో రిక్షావెధవ తాగేసి అద్దె ఇవ్వనని గొడవ పెట్టాడు. రిక్షా అద్దె తగ్గించాలట. లేకపోతే ఎవర్నీ రిక్షాలు తిప్పనీయడట... వెధవన్నర వెధవ."

భాస్కరమూర్తి గుండె దడదడ కొట్టుకుంది.

"మీరు రిక్షాలెప్పుడు కొన్నారే?"

"ఏదీ, నువ్వెప్పుడొచ్చినా ముళ్ళమీద నించున్నట్టు నించుని వెళ్ళిపోతావు కదా? సంవత్సరం నుంచి రిక్షాలు అద్దెకు తిప్పుతున్నారా మీ బావ..."

"అయితే ఇప్పుడు రిక్షా వాళ్ళంతా సమ్మె చేస్తున్నారా" ఆతృతగా అడిగాడు మూర్తి. ఒకవంక అతనికేదో గర్వంగానూ ఉంది.

కిటికీ చిడత గిరగిర తిప్పుతూ పగలబడి నవ్వింది అక్కగారు.

"వాళ్ళమొహం... సమ్మెలు కూడానా దరిద్రపు గాడిదలకి? ఇవాల్టి నుండి రిక్షాలు అద్దెకు ఇవ్వనని మీ బావ వాళ్ళకు చెప్పేశారు.

దాని గురించే ఈ బ్రతిమిలాట. రిక్షాలు దొరక్కపోతే వాళ్ళూ, పిల్లలూ వస్తుల్తో మాడి చస్తారా..."

ఏనుగును మ్రింగి, చెట్టుని చుట్టుకుంటున్న కొండచిలువలా అన్పించింది అక్కగారు మూర్తికి.

బయట కోలాహలం, తగ్గింది.

ఇంట్లోకి వచ్చిన బావను అడిగిందామె. "ఒప్పుకున్నారా?"

గావంచాతో మొహం తుడుచుకుంటూ చెప్పాడతను. "ఒప్పుకోక చస్తారా మట్టివెధవలు. ఇవాల్టినుండి రిక్షాకి ఎనిమిది రూపాయిలద్దె. పండుగ రోజుల్లోనూ, సంతరోజుల్లోనూ పదిరూపాయలు. కాగితాలమీద వేలిముద్రలు వేయించుకున్నాను."

మరో క్షణం అక్కడ ఉండబుద్ధి కాలేదు మూర్తికి.

రోడ్డెక్కి ఆలోచనలో పడ్డాడు.

"ఎందుకిలా జరిగింది?"

తమ ఆశయాలకు ఈ సంకెళ్ళేమిటి?

శ్రామిక శక్తి నిర్వీర్యమయిపోయిందా?

ఎన్నో జవాబులేని ప్రశ్నలు.

వారం రోజుల తర్వాత హైదరాబాద్‌లో జరుగనున్న సమావేశానిక్కావల్సిన ఉపన్యాసం తయారవుతోంది అతని లోపల్లోపల.

★ ★ ★

క్రీ.శ. 1994.

"కార్మికమంత్రిగారే మన్నారా రమణా? ఫ్యాక్టరీ మళ్ళీ నడుస్తుందా?" ఆతృతతో అడిగాడు బసవరాజు ఇరవై ఏళ్ళ కొడుకు రమణారావుని.

ఫ్యాక్టరీ ప్రమాదంలో రెండుకాళ్ళూ, ఆ వెనుక ఉద్యోగమూ పోగొట్టుకున్న తండ్రిని జాలిగాచూసి చెప్పాడు రమణారావ్.

"లేదు. లాకౌట్ సడలించరట. వర్కర్స్‌లో పాతికశాతాన్ని రిట్రెంచ్ చేస్తేనేగానీ ఫ్యాక్టరీ నడపలేమంటున్నారు ప్రొప్రయిటర్లు. అదే విషయాన్ని మమ్మల్ని ఒప్పుకొమ్మంటున్నారు మంత్రిగారు..."

"రెండు నెలలయిందిరా రమణా? ఇంకెన్నాళ్ళు వస్తులుండగలం? నేను చెప్పినట్టు నువ్వు సిగ్గొగ్గు లొగ్గేసి నాయుడిగారింటి నుండి రిక్షా తెచ్చుకోరా, అద్దెకు త్రిప్పితే ఇంట్లో ఎసరుడుకుతుంది..."

మంచినీళ్ళతో ఆకల్ని జయించే ప్రయత్నం చేస్తూ అన్నాడు రమణ. "తాతలాగే నువ్వూ రిక్షా త్రొక్కి ఉంటే... నేనూ అలానే బ్రతికేటోణ్ణి. నెలజీతానికి అలవాటుపడ్డ బానిసై నువ్ ఫ్యాక్టరీలో కూలీగా చేరావు. నీ కాళ్ళు పోయినందుగాను నాకు నీ ఉద్యోగమిచ్చారు. ఇప్పుడు రిక్షా తొక్కమంటే నా వశమవుతుందా?"

అరుగుమీద కూర్చున్న నర్సిగాడు మనవడి మాటలు విని శక్తి కూడగట్టుకుని ఇంట్లోకి వచ్చాడు.

"ఒద్దురా నాయనా! రిచ్చావోడి బతుక్కీగేరంటీ లేదనే ఆడికాల్లూ, ఈడికాల్లూ, పట్టుకొని మీ అయ్యకు ఉజ్జోగం ఏపించాను. సావో, రేవో.. కాలమే తీరుస్తాది గాని నువ్వు రిచ్చా తొక్కకురయ్యా" అన్నాడు దగ్గుతూ, రొప్పుతూ.

దరిద్రానికి పట్టుగొమ్మల్లాంటి అలాటి ఎన్నో ఇళ్ళల్లో ఆకలిమంటలు అంబరాన్ని చుంబిస్తున్నాయి.

"ఒరేయ్ నాయనా... కొండతో ఢీకొంటే గొర్రె తలే సితికిపోతాది. అంతాకల్సి ఆ ప్రొప్రయిటరయ్య పాదాలమీద తలలు బాదుకోండిరా... ఆ బాబుకే దయకలిగి ఫ్యాక్టరీ తెరిసాడంటే మన బొట్లల్లో బలుసాకు తినగలం..." దీనంగా, దయనీయంగా చెప్పాడు నర్సిగాడు.

తండ్రి ఆలోచన సబబేనన్నట్టు అంగీకారంగా తల ఊపుతున్నాడు బసవరాజు.

తనలాటి మరెందరినో కూడగట్టుకుని ప్రొప్రయిటర్ కాళ్ళమీద పడే ఆలోచనలో పడ్డాడు రమణారావు.

ఆకలి ఆ మూడు తరాల్ని ఒకేలా ఆలోచింపచేసింది.

కార్మికమంత్రికి వినయంగా వంగి నమస్కరించి బ్రీఫ్‌కేస్ అందించాడు ఫ్యాక్టరీ యజమాని.

"తమబోటి వాళ్ళు హెచ్చరించబట్టిగానీ, లేకపోతే ఈ పేడి వెధవలు స్ట్రయికంటూ ఫ్యాక్టరీని నష్టాల్లో ముంచేసే వారే. దానికి ముందుగానే లాకౌట్ ప్రకటించమని మీరు చెప్పినప్పుడు ఈ సలహా ఎంత లాభిస్తుందోనన్నది నా ఊహకు అందలేదు." అంటున్నాడు సంగిసంగిగా.

చిద్విలాసంగా నవ్వుతూ బ్రీఫ్‌కేస్‌లో నోట్లకట్టల్ని తనివితీరా చూసుకుంటున్నాడు కార్మిక మంత్రి.

అతను భాస్కరమూర్తి!!

★